ధరల కమిషన్ చైర్మన్‌గా అశోక్ దళవాయి



రాయచూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాధికారిగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అశోక్ దళవాయిని పంట ఉత్పత్తుల ధరల కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అశోక్ దళవాయితోపాటు సభ్యులుగా బళ్ళారికి చెందిన గాదిలింగనగౌడ, కొప్పళకు చెందిన డీఎచ్ పూజార్‌లను నియమిస్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉప కార్యదర్శి రాజశ్రీ ఆదేశాలు జారీ చేశారు.

అప్పుల ఊబి..!



● అత్యధికంగా బెస్కాంలో రూ.18,095 కోట్లు ● పదివేల కోట్లు దాటిన హెస్కాం అప్పులు ● ఆదాయం పెంపుకోసం ప్రజలపై భారానికి కసరత్తు

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న రవాణా, విద్యుత్ సంస్థలు దశాబ్దాల కాలంగా నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి. అత్యవసరమైన విభాగాలు కాబట్టి లాభాల ఆలోచన కంటే ప్రజలకు అంతరాయం కలుగకుండా ఉండాలని సేవలు కొనసాగిస్తున్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మక అమలు చేస్తున్న గ్యారెంటీలలో కీలకమైన రవాణా విభాగానికి అనుబంధంగా శక్తి గ్యారెంటీతో ఆర్టీసీ సంస్థలు నష్టాలబాటలో ఉన్నాయనేది తెలిసిందే. ఇక గృహజ్యోతి ద్వారా అమలయ్యే విద్యుత్ రంగ సంస్థలు ఎస్కాంలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. గృహజ్యోతి అమలుకు ముందునుంచే అప్పులు ఉన్నాయి. నిర్వహణ, కొనుగోళ్ల వంటి సందర్భాల్లో ప్రత్యామ్నాయం లేక అప్పులబాట పట్టారు. ఇలా రాష్ట్ర విద్యుత్ సరఫరాల కంపెనీలు (ఎస్కాం)లకు సుమారు 42వేల కోట్లు అప్పులు మిగిలాయి. ఈ ఊబి నుంచి బయటపడేందుకు పరోక్షంగా చార్జీల పెంపువైపే దృష్టి సారిస్తున్నారు. తద్వారా వినియోగదారులపై మరింత భారం మోపుతున్నారు. స్వయంగా విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్ ఇటీవల బెళగావి శాసనసభలో విద్యుత్‌శాఖ ఆర్థిక పరిస్థితికి సంబంధించి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. అందులో 42వేల కోట్ల రూపాయల అప్పులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో బెంగళూరు పరిధిలోని బెస్కాం సంస్థకు రూ.18,095 కోట్లు అప్పులు ఉన్నాయి. ఆ తర్వాత హుబ్బళ్ళి పరిధిలోని హెస్కాం సంస్థ రూ.10,332 కోట్లుగా ఉంది. అప్పుల భారం నుంచి బయటపడేందుకు విద్యుత్‌శాఖ ఆస్తులను తాకట్టు పెడుతోంది. 11కేవీ ఓవర్‌హెడ్ మార్గాల ద్వారా, అండర్‌గ్రౌండ్‌లోనూ లైన్‌లు ఏర్పాటు, కొత్త సాఫ్ట్‌వేర్‌ల అమరిక అప్‌గ్రేడ్ చేయడం వంటి కారణాలతో ఎస్కాంలు కోట్లాది రూపాయలు అప్పులు చేశాయి. ఈ పరిణామంతో రుణాలు కొండలా పెరిగాయి.

గృహజ్యోతి భారం..

గృహజ్యోతి ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందిస్తున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లిస్తోంది. రాష్ట్రానికి సంబంధించి 90శాతం మంది నివాసాలకు గృహజ్యోతి పథకం అమలులో ఉంది. ఇక వ్యవసాయ పంప్‌సెట్లకు సంబంధించి భారాన్ని ప్రభుత్వం నియమితంగా అందిస్తోంది. వీటితోపాటు విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి బకాయిలను వేల కోట్ల రూపాయలు విద్యుత్‌సంస్థలు పెండింగ్‌లో ఉంచాయి.

లాభాల్లో మెస్కాం

2024 మార్చి చివరినాటికి లాభాలలో ఉన్న మంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ (మెస్కాం) నిలిచింది. 59.19 కోట్ల రూపాయలు లాభాల్లో ఉంది. ఇక మిగిలిన విద్యుత్ కంపెనీలన్నీ నష్టాలలో ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఎస్కాంలు అప్పులనుంచి బయటపడేందుకు రానున్న మూడేళ్లకోసం విద్యుత్ చార్జీలను పెంచాలని కేఈఆర్‌సీకి ప్రస్తావనలు పంపారు. యూనిట్‌కు 65 పైసలనుంచి గరిష్ఠంగా 95 పైసలు పెంచదలిచారు. నిర్ణయం తీసుకుంటే విద్యుత్‌చార్జీలు పెరగనున్నాయి.

ఏటా సవరణలు

ఏటా విద్యుత్‌చార్జీల సవరణ అవుతోంది. కర్ణాటక విద్యుత్‌శక్తి కమిషన్ (కేఈఆర్‌సీ) దశాబ్దన్నర కాలంగా పెంచుతూ వస్తోంది. మరోవైపు ఇటీవల కొన్నేళ్లలో ప్రతినెలా ఇంధనం కొనుగోలు ఒప్పందాల పేరిట నెలవారీ సవరిస్తున్నారు. పరిశ్రమలకు అందించే విద్యుత్ ద్వారా లాభాలు వస్తున్నా ఎస్కాంలు బయటపడడం లేదు.

వసూలు కాని బకాయిలు

2024 మార్చి చివరకు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలనుంచి కొనుగోలు చేసి చెల్లించాల్సిన బకాయిలపైకి బెంగళూరు ప్రాంతానికి అనుబంధమైన బెస్కాంరూ.8,360 కోట్లు, హుబ్బళ్ళి పరిధిలోని హెస్కాం రూ.5,434.89 కోట్లు, గుల్బర్గా పరిధిలోని జెస్కాం 3121.16 కోట్లు, చాముండేశ్వరి ఎలక్ట్రిసిటీ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్ (సెస్కాం) రూ.2634.30 కోట్లు, మంగళూరు పరిధిలోని మెస్కాం రూ.1414 కోట్లు బకాయిలు ఉన్నాయి.

ఎస్కాంల వారీగా అప్పులు ఇలా..

సంస్థ	అప్పులు (రూ.కోట్లలో)
బెస్కాం	18,095.82
మెస్కాం	1623.30
సెస్కాం	4348.54
హెస్కాం	10,332.40
జెస్కాం	4,624.49
మొత్తం	42,024.55



అన్నివర్గాలను ఆకట్టుకున్నారు

● మన్మోహన్ మృతి దేశానికి తీరనిలోటు : స్పీకర్, సభాపతి సంతాపం

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ దేశంలోని అన్ని వర్గాలను ఆకట్టుకున్నారని, ఆయన మృతి దేశానికి తీరని లోటని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వేర్వేరుగా వారు సంతాప సందేశం ప్రకటించారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా ఆయన ఎన్నో విశిష్ట పథకాలు అమలు చేశారని హొరట్టి పేర్కొన్నారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల అనంతరం ఎక్కువ అవధి ప్రధానిగా పనిచేశారన్నారు. ఆర్థిక పురోగతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆహార హక్కు, సమాచార హక్కు, సర్వశిక్షణా అభియాన, నరేగా, నిర్బంధ విద్య వంటి వాటితో అన్ని వర్గాల ప్రజలకు మౌలిక సదుపాయాలు అందేలా పాటుపడ్డారన్నారు. సరళమైన వ్యక్తిత్వం కల్గిన మితభాషి అన్నారు. పలు ఆర్థిక సంక్లిష్ట స్థితులలో చక్కటి సలహా సూచనలతో గట్టెక్కించేలా చేశారన్నారు. ఆయనలేని లోటు భరించే శక్తి వారి కుటుంబానికి ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆయన మృతి దేశానికి తీరనిలోటు

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని స్పీకర్ యూటీ ఖాదర్ అభిప్రాయపడ్డారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు వెళ్లేలా చేయడంలో ఎన్నో బాటలు వేశారన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రత్యేకించి నరేగా పథకం ఇప్పటికీ లక్షలాదిమందికి ఎంతో ఉపాధి కల్పిస్తోందన్నారు. 1991లో ఆర్థికంగా క్లిష్టమైన సమయంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి గట్టెక్కించారన్నారు. ఆయన భావితరాలకు స్ఫూర్తి అని, ఆయన ఆత్మకు శాంతి లభించాలని కోరారు.

జేడీఎస్ ఆధ్వర్యంలో నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల నగరంలో వివిధ పార్టీలు వేర్వేరుగా నివాళులు అర్పించాయి. శుక్రవారం జేడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ సహా కీలక నాయకులంతా పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. దేవెగౌడ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్‌తో తనకు ఆత్మీయ సంబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. ఆయన పాలనలో చిరకాలం గుర్తుండిపోయే పథకాలు, అభివృద్ధి పనులను ప్రారంభించారన్నారు. దేశంలో మధ్య, పేద తరగతి ప్రజల సంక్షేమంతో పాటు దేశ ఆర్థికతను రూపొందించిన నిపుణుడు మన్మోహన్‌సింగ్ అన్నారు. మృదుస్వభావి, మితభాషిగా పేదవర్గాల అభ్యున్నతి పట్ల నిరంతరం ఆలోచించిన వారు మన్మోహన్‌సింగ్ అన్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ, జేడీఎస్ నాయకులు

ఉద్యోగం వీడి.. ఉద్యాన సాగు వైపు..

● తైవాన్ పింక్ జామతో లాభాలు గడిస్తున్న యువరైతు ● అధికారుల సూచనలతో అధిక రాబడి..



తైవాన్ పింక్ జామ పంటను చూపుతున్న బసవరాజు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం అంటేనే యువత మొహం చాటేస్తున్నా, సాగునే జీవనాధారంగా చేసుకుని లాభాలు గడిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు సండూరు తాలూకా పరిధిలోని తాళూరు గ్రామానికి చెందిన యువ రైతు బసవరాజు. ఐటీఐ చదివిన బసవరాజు జిందాల్ కంపెనీలో పనిచేసేవాడు. చాలీచాలని జీతంతో ఉద్యోగంపై ఆసక్తి కనబరచలేదు. ఉద్యోగం మాని ఉద్యానసాగు వైపు అడుగులు వేశాడు. తమకున్న మూడు ఎకరాల పొలంలోనే ఉద్యాన పంటలు సాగుచేసి అందరిచేత హౌరా..! అనిపిస్తున్నాడు. మొదట జొన్న, మొక్కజొన్న, వరి, ఉల్లి తదితర పంటలు సాగుచేసి నష్టాలు చూసిన బసవరాజు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో తైవాన్ జామసాగును చేపట్టి నష్టాలనుంచి గట్టెక్కాడు. తనకున్న వర్షాధారిత భూమిలో తైవాన్ పింక్ రకానికి చెందిన జామను మూడు ఎకరాల్లో సాగు చేశాడు. ప్రస్తుతం అధిక దిగుబడి వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నాడు. రాయచూరులోని ప్రైవేట్ ఫారం నుంచి రూ.50వేలకు వెయ్యి తైవాన్ జామ మొక్కలను తీసుకొచ్చారు. మొక్కకు ఏడు అడుగుల నిడివి చొప్పున,



ప్రతి వరుసకు 8 అడుగుల చొప్పున మొక్కలు నాటాడు. మొక్కలకు రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా, కేవలం సేంద్రియ ఎరువును వేస్తూ సాగుచేయడం ద్వారా ప్రతి జామపండు 500 గ్రాములు బరువుతో అధిక ఉత్పత్తి వచ్చిందని ఆయన హర్షం వ్యక్తం చేస్తున్నాడు. పంటను బెంగళూరు, మైసూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నాడు. సాగునీటి బోరు ద్వారా లభించే నీటితోనే వ్యవసాయ శాఖ సహకారంతో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని ఉపయోగించడంతో పాటు పశువులు, పక్షుల బారి నుంచి కాపాడేందుకు పొలం చుట్టూ కంచెవేసినట్లు తెలిపారు.



ఎగుమతికి సిద్ధంగా..

యువ రైతులు సాగుకు ముందుకు రావాలి..

వ్యవసాయాన్ని వదిలి ఆధునిక జీవనానికి అలవాటు పడి నగరాల వైపు మక్కువ చూపుతున్న నేటి యువరైతులకు బసవరాజు ఆదర్శంగా నిలిచాడు. వ్యవసాయ సాగుతో పాటు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో సాగుచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుపై యువత ఆసక్తి చూపాలి.

– హనుమప్పనాయక, ఉద్యానవన శాఖాధికారి



ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పిన రైతులు

జల్లు దరింపు..!

- వరి రైతును వణికిస్తున్న చిరుజల్లులు
- టార్పాలిన్లతో ధాన్యానికి రక్షణ
- ఆందోళన చెందుతున్న అన్నదాత

8

ప్రాణాలు తీసిన వీలింగ్

బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

విజయపుర, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వీలింగ్ చేస్తూ ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణ బైపాస్‌రోడ్డుపై ద్విచక్రవాహనంలో వీలింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఉదయం ఓ మోస్తరు వర్షం కురుస్తున్నా యువకులు వీలింగ్ చేశారు. మృతి చెందిన వారిని పట్టణానికి చెందిన మనోజ్ (19), హర్ష్‌జ్ (19)గా గుర్తించారు. పలువురు యువకులతో కలిసి వీలింగ్ చేస్తుండగా వేగంగా వస్తూ క్యాంటర్‌ను ఢీ కొనడంతో కిందపడ్డారు. తలకు బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదాన్ని తప్పించేందుకు క్యాంటర్ డ్రైవర్ రోడ్డు పక్కకు మళ్లించాడు. అదృష్టవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టకుండా తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నారు. కాగా బైపాస్‌రోడ్డుపై ఇటీవల యువకులు వీలింగ్ చేయడం అధికమైందని పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.





మనోజ్ (ఫైల్), హర్ష్‌జ్ (ఫైల్)



అతి విశ్వాసం, అధికార గర్వంతో విర్రవీగిన వైసీపీకి జిల్లా ప్రజలు షాక్ ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఆపార్టీకి పీడకలను మిగిల్చాయి. దౌర్జన్యాలు, అరాచకాలతో పాలన సాగించిన ఫ్యాన్ పార్టీ రెక్కలు ఓటరు తీర్పుతో విరిగిపోయాయి. కూటమిగా జట్టు కట్టి బరిలో నిలిచిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల దెబ్బకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది. ఐకమత్యంగా సాగిన ఆపార్టీలు ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్నాయి. ఎన్నికల విజయం తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి అమాత్య పదవులు సైతం దక్కాయి. ఉమ్మడి జిల్లాలో అంతంతమాత్రంగానే బలం ఉన్నా టీడీపీతో జట్టు కట్టడం వల్ల జనసేన, బీజేపీలు బాగా లాభపడ్డాయి. నామినేటెడ్ పదవుల్లో సైతం ఆపార్టీలకు మంచి ప్రాధాన్యం దక్కింది.


కూటమి ఐక్యతారాగం

ధర్మవరం ఎన్నికల ప్రచార సభలో (ఫైల్)



క్లీన్‌స్వీప్

ఉమ్మడి జిల్లాలో టీడీపీ కూటమి అద్భుత విజయం


ఎన్నికలలో జగన్ ప్రచారం

మొత్తం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కైవసం
అనంత రాజకీయ చరిత్రలో తిరుగులేని ఘనత
అధికార గర్వంతో చతికిలపడ్డ వైసీపీ
నామినేటెడ్‌లోనూ కూటమి నేతలకు పదవులు
నేతల రాతను మార్చిన 2024

ఈ ఏడాది ఆరంభం నుంచే ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అప్పటి వరకూ స్తబ్దుగా ఉన్న తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు, ఆ పార్టీ నేతలను మేల్కొల్పేందుకు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర ఎంతగానో ఉపయోగపడింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య పెరగడమే ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే టిక్కెట్ ఆశించిన పలువురు నారా లోకేశ్ పాదయాత్రలో ఎవరికి వారు తమ బలాలను చూపించుకునేందుకు పోటీపడ్డారు. పాదయాత్ర జిల్లా సరిహద్దు దాటినప్పటికీ ఆయనకు మరింత దగ్గరకావాలనే యోచనలోనే ఆ పార్టీ నేతలు అప్పుడప్పుడు ఇతర జిల్లాలకు వెళ్లొచ్చారు. మరోవైపు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఎవరికి వారు ఆందోళనలు చేశారు. అయితే అభ్యర్థుల ప్రకటనతో కొందరికి మోదం, మరికొందరికి ఖేదం మిగిలింది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిలో కొత్తవారికి టిక్కెట్లు కేటాయించారు. అందులో అనంతపురం అర్బన్ నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు నుంచి అనూహ్యంగా వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గుమ్మనూరు జయరాంను టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల నుంచి పాతవారినే పోటీలో ఉంచారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్, రాయదుర్గం నుంచి కాలవ శ్రీనివాసులు, తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ పోటీచేశారు. కూటమి పార్టీల సహకారంతో మొత్తం అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. జిల్లా చరిత్రలో అన్ని నియోజకవర్గాల్లోనూ స్వీప్ చేసిన పార్టీగా టీడీపీ నిలిచింది.

ఎదురులేని టీడీపీ

కలిసొచ్చిన పొత్తు

సార్వత్రిక ఎన్నికల ముందువరకూ తెలుగుదేశం పార్టీ ఒంటరిగానే వైసీపీ పాలనపై పోరుబాట సాగించింది. అదే తరహాలో జనసేన శ్రేణులు విడిగానే వైసీపీ పాలనపై పోరాటాలు చేశాయి. బీజేపీ సైతం అడపాదడపా వైసీపీ పాలనను ఎండగడుతూ వచ్చింది. చంద్రబాబు అరెస్టుతో జనసేనాని పవన్‌కళ్యాణ్ బహిరంగంగా టీడీపీతో పొత్తును ప్రకటించారు. ఆ తరువాత కొన్ని రోజులకు బీజేపీతోనూ పొత్తు ఏర్పడింది. ఎన్డీఏ కూటమిగా మూడు పార్టీలు కలిసి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి, గెలిచాయి. ఎన్నికల పొత్తు బీజేపీ, జనసేనలకు బాగా కలిసొచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అటు బీజేపీ, ఇటు జనసేన నాయకులకు అధికారంలోనూ భాగస్వామ్యం లభించింది. మరీ ముఖ్యంగా అధికార యంత్రాంగంలోనూ గుర్తింపు పెరిగింది.



అనంతపురం/ పుట్టపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకే ఏడాదిలో రెండు ప్రభుత్వాలను చూపించిన ఘనత 2024కి దక్కుతుంది. ఈ ఏడాది జిల్లా ప్రజలు టీడీపీ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో నా కూట మిలో భాగస్వామి అయిన టీడీపీ అభ్యర్థులకే జిల్లా ప్రజానీకం పట్టం కట్టారు. పార్లమెంటు స్థానం కూడా టీడీపీకే చిక్కింది. సెంటిమెంట్‌ను తిరగరాస్తూ ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలిచి చంద్రబాబు కేబినెట్‌లో కీలకమైన ఆర్థికశాఖను దక్కించుకోవడం ఈఏడాది రాజకీయంగా ఎ ం లో విశేషం.


కేశవ్‌కు కలిసొచ్చిన కాలం

చతికిలపడ్డ వైసీపీ

అంతవరకు అధికారం అండగా రంకెలేసిన వైసీపీ ఎన్నికల్లో చావుదెబ్బతింది. ఎన్ని వ్యూహాలు రచించినా, సామదానదండోపాయాలు ఉపయోగించినా ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను తిరస్కరించారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులు ఘోరంగా ఓడిపోయారు. జగన్ కేబినెట్‌లో పని చేసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉష శ్రీచరణ్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు పంపినా ఫలితం లేకపోయింది. అలాగే కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసిన అప్పటి ఎంపీ తలారీ రంగయ్య కూడా ఘోరంగా ఓడిపోయారు. అనంతపురం అర్బన్ నుంచి అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ నుంచి విశ్వేశ్వరరెడ్డి, గుంతకల్లు నుంచి వై. వెంకటరామిరెడ్డి, తాడిపత్రి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాప్తాడు నుంచి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలకు ఓటర్లు నిర్మొహమాటంగా తిరస్కరించారు. వీరు ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పుడు ఆయా నియోజకవర్గాల్లో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాల ఫలితమే ఓటమి అనేది ఆ పార్టీ వర్గాల అభిప్రాయం. ఇక రాయదుర్గం ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన కాపు రామచంద్రారెడ్డికి టికెట్ దక్కలేదు. ఆ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, అప్పటి ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్న మెట్టు గోవిందురెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా దింపినప్పటికీ ఓటమి తప్పలేదు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తో పాటు ఆరు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. హిందూపురం, పెనుకొండ, రాప్తాడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ భారీ ఆధిక్యం సాధించగా పుట్టపర్తి, కదిరిలో మంచి మెజార్టీ సాధించింది. కాగా మడకశిరలో మాత్రం ఎంఎస్ రాజు 425 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు. టీడీపీ, జనసేనతో జత కట్టిన కమలం ధర్మవరంలో వికసించింది. జిల్లాలో పార్లమెంట్‌తోపాటు ఐదుచోట్ల టీడీపీ కూటమి ఒకచోట బీజేపీ గెలుపుతో వైసీపీ అడ్రస్ గల్లంతయ్యింది. జిల్లాలో తొలిసారి బరిలోకి దిగినా అందరూ గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. తొలిసారి గెలిచినా ఇద్దరికి మంత్రి పదవులు సైతం దక్కాయి. అధికారం శాశ్వతమని భ్రమించి, అరాచక పాలన సాగించిన వైసీపీకి జిల్లాలో కోలుకోలేని దెబ్బతగిలింది.


ఎన్నికల ప్రచార సభలో బీకే, సవిత, నిమ్మల

2019 సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ మినహా అన్ని స్థానాల్లోనూ వైసీపీ గెలించింది. అంతకు మునుపు 2014 ఎన్నికల్లో కదిరిలో వైసీపీ గెలిచింది. ఐదేళ్ల వైసీపీ ఎమ్మెల్యేల అరాచక పాలనకు విసిగిపోయిన ప్రజలు వారిని ఇంటికి సాగనంపారు. ఎన్నికల్లో ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తితోపాటు కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ బరిలోకి దింపి హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్, మడకశిర, కదిరి అసెంబ్లీ స్థానాలకు కొత్త ముఖాలను బరిలో దింపారు. హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా బళ్లారి మాజీ ఎంపీ(బీజేపీ) శాంతను పోటీకి దింపారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణకు స్థాన చలనం కలిగించి, అనంతపురం ఎంపీగా పోటీ చేయించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నుంచి బరిలో నిలిపారు. ఎవరిని ఎక్కడకు మార్చినా, దిగుమతి చేసుకున్నా వైసీపీ ఆశలు ఫలించలేదు. పోటీ చేసిన ప్రతి చోటా ఓటమే పలకరించింది. ప్రస్తుతం జిల్లాలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేల్లో కొందరు అప్పుడప్పుడు కన్పిస్తున్నా, ఓటమితో పార్టీ కేడర్ మొత్తం డీలా పడి ముఖం చాటేస్తోంది.

కూటమి దెబ్బకు..

ధర్మవరంలో కమల వికాసం



సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమిగా జతకట్టడంతో అందరి అంచనాలను తలకిందుల చేస్తూ ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసిన సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం బీజేపీ కోటాలో మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. ధర్మవరంలో అంతంతమాత్రంగానే ఉన్న బీజేపీ కూటమిలో భాగస్వామిగా మారడంతో అద్భుత విజయం సాధించింది. వైసీపీ గట్టి పోటీ ఇచ్చినా కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ 3734 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు బీజేపీకి బాగా బదిలీ కావడంతో ధర్మవరంలో కమలం వికసించింది.

ఐకమత్యంగా విజయం

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుగా ఏర్పడటం విజయానికి బాగా కలిసొచ్చింది. జిల్లాలో జనసేన పార్టీ నిర్మాణం లేకపోయినా, ఉనికి అంతమాత్రం ఉన్న బీజేపీలు టీడీపీతో జతకట్టడం బాగా లాభించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నామినేటెడ్ పదవుల్లో మొదటి, రెండో విడతల్లో సైతం జనసేన, బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల జరిగిన సాగునీటి ఎన్నికల్లో జనసేన, బీజేపీ శ్రేణులకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల్లో ప్రాధాన్యం దక్కింది. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించేలా కూటమి పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.

నామినేటెడ్‌లో కూటమి నేతలకు పదవులు



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించి, అధికారాన్ని చేపట్టడంతో కూటమిలో భాగస్వాములైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. జిల్లాలో టీడీపీ ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు దక్కాయి. జడ్పీ మాజీ చైర్మన్ పూలనాగరాజుకు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పదవి దక్కగా, మాజీ ఎమ్మెల్సీ దీపకర్‌రెడ్డికి సీడాప్ చైర్మన్ పదవి లభించింది. ఇక జనసేన నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు అహుడా చైర్మన్ పదవి లభించింది. బీజేపీ నాయకుల్లో కొందరికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. మొత్తంగా రాజకీయంగా ఈ ఏడాది కూటమి పార్టీలు, ఆయా పార్టీల నేతలకు ఆనందాన్ని అందించగా, వైసీపీ నేతలకు నిరాశ, నిస్పృహను మిగిల్చింది.

అసెంబ్లీలోకి కొత్తముఖాలు

జిల్లాలో తొలిసారిగా నలుగురు కొత్త వారు ఎమ్మెల్యేలుగా గెలిచారు. పుట్టపర్తి నుంచి పల్లె సింధూరరెడ్డి, పెనుకొండ నుంచి సవిత, ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్, మడకశిర నుంచి ఎంఎస్‌రాజులు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. మడకశిర ఎస్సీ రిజర్వుడ్ నియోజక వర్గం టీడీపీ కూటమి అభ్యర్థిగా ప్రకటించిన సునీల్‌కుమార్ బదులుగా శింగనమలకు చెందిన రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజును తెరపైకి తెచ్చారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కేవలం 23 రోజుల్లోనే ఎంఎస్‌రాజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆపై టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. పొత్తులో బీజేపీ కోటా కింద ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్ రంగంలోకి దిగి తొలిసారిగా ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు. పెనుకొండ నుంచి సవిత బరిలో దిగి జిల్లాలో భారీ మెజార్టీతో గెలవడంతో పాటు మంత్రి పదవిని పొందారు. కాగా జిల్లా నుంచి మంత్రి పదవులు చేపట్టిన ఇద్దరూ బీసీ వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం.




ఉపాధి చూపిన మన్మోహన్

స్మరించుకున్న బండ్లపల్లి గ్రామస్థులు... మాజీ ప్రధాని మృతితో గ్రామంలో విషాదఛాయలు


ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు..


దేశంలోనే మొట్టమొదటి జాబ్‌కార్డు

ఉపాధి హామీ పథకంతో మండలంలోని బండ్లపల్లి గ్రామం పేరు దేశనలుమూలల వినిపించింది. ప్రధాని హోదాలో దివంగత మన్మోహన్‌సింగ్ ఇక్కడికి వచ్చి పథకాన్ని ప్రారంభించారు. అప్పటి ఆయన పర్యటనను గ్రామస్థులు తీపి జ్ఞాపకంగా మనసులో నేటికీ ఉంచుకున్నారు. అయితే గురువారం రాత్రి ఆయన మరణవార్త విని బండ్లపల్లి గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. పేద ప్రజలు వలస పోకుండా ఉన్న ఊరిలోనే వంద రోజులు పనులు చేసుకునేలా ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆపద్బాంధవుడని వారు కొనియాడుతున్నారు. ఆయన మృతి ఎంతో విదారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, నార్పల



నా ఇద్దరు పిల్లలను బతికించుకున్నా



నాభర్త చీమల రాముడు అనారోగ్యంతో 22ఏళ్ల కిందట చనిపోయాడు. అప్పటికి నాకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. పనులు లేక, ఇద్దరు పిల్లలను ఎలా పోషించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ఆత్మహత్య అనుకుంటున్న తరుణంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేవుడిలా ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఉపాధి పనులకు వెళ్లి, వచ్చిన ఆదాయంతో నా ఇద్దరు పిల్లలను పోషించుకున్నా. రెండున్నర ఎకరాల భూమిలో ఉపాధి పథకం ద్వారానే మామిడి చెట్లను సాగు చేశా. అలాంటి ఉపాధి పథకాన్ని తెచ్చిన మన్మోహన్‌సింగ్ లాంటి దేవుడు చనిపోవడం బాధాకరం.

- చీమల పెద్దక్క, తొలి జాబ్‌కార్డు పొందిన మహిళ

షేక్ హ్యాండ్ ఇచ్చారు



చేయడానికి పనులు లేని కాలంలో ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ మా ఊరికి వచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పుడు నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి, నా భుజం తట్టి మీరు ఎవరి దగ్గర పనులు చేయవద్దని ఉపాధి పనులు చేసుకోమని హిందీలో చెప్పారు. నాకు అర్థం కాకపోవడంతో అప్పటి కలెక్టర్ అనురాధ మేడం దాన్ని తెలుగులో చెప్పారు. ఉపాధి పనులు చేయడం ద్వారా వచ్చిన డబ్బులతోనే నా కూతురిని నర్సింగ్ కోర్సు చదివించా. ఆమెకు ఆర్టీటీలో ఉద్యోగం వచ్చిందన్నారు.

- బండారు బాలనరసింహులు

బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా



కుటుంబాన్ని పోషించడం కోసం భార్య, పిల్లను వదిలి ఎనిమిదేళ్లగా బళ్లారి, బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా. ఒడిదుడుకుల మధ్య నిద్రలేని రాత్రులు గడిపా. ఎప్పుడైతే ఉపాధి హామీ పథకం వచ్చిందో అప్పటి నుంచి మా గ్రామానికి తిరిగి వచ్చా. ఉపాధి పనులకు వెళుతూ ఒక కుమార్తెకు పెళ్లి చేశా. మరో ఇద్దరు పిల్లలను టీటీసీ చదివిస్తున్నా. అద్భుతమైన ఉపాధి పథకాన్ని మాలాంటి పేదలకు అందించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి ఎంతో బాధకలిగిస్తోంది.

-రామకృష్ణ, బండ్లపల్లి

బెంగళూరులో పాచిపనులకు వెళ్లా



ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టకముందు ఊర్లో పనులు లేకపోవడంతో పూటగడవడం కోసం నేను, నా భర్త కలిసి బెంగళూరుకు వలస వెళ్లాం. అక్కడ నేనే పాచిపనులు చేసేదాన్ని. ఆరేళ్లు అక్కడే ఉన్నాం. ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించారని తెలిసి సొంతూరికి వచ్చేశాం. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ నా భర్త ఎర్రప్పతో కలిసి ఉపాధి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం.

-కుళ్లాయమ్మ, బండ్లపల్లి

తిరుపతి ప్యాసింజర్ రైలు రద్దు



గుంతకల్లు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ కుంభమేళాను పురస్కరించుకుని కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కుంభమేళాకు భక్తుల తరలింపు కోసం కొన్ని రైళ్లను అక్కడికి నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఈనెల 29నుంచి మార్చి1 వరకు తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు తెలియజేశారు. దీంతో ఇదివరకే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల టికెట్‌లను రద్దు పరిచినట్లు తెలియజేశారు.

'రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోండి'

అనంతపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పలు రకాల పంటల్లో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం, మెట్ట వ్యవసాయం ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు, సేద్యవిభాగం సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి, రీసర్చ్ అసోసియేట్ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం మొలక దశ నుంచి పూత దశలో ఉందన్నారు. శాకీయ దశలోని పంటలో 15- 20 రోజులకు అంతర కృషి చేసి కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలో సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతు లోపం గమనించినట్లు తెలిపారు. జింక్ లోప నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఇనుప ధాతు లోపం నివారణ కోసం అన్నబేది 5 గ్రాములు, సిట్రిక్ ఆమ్లం 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసుకుంటున్న రైతులు సిఫార్సు చేసిన ఎరువుల్లో ఒకటో వంతు నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులు చివరి దమ్ములో వేయాలని సూచించారు. నాట్లు వేసిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ కాలి బాటలు వేసుకోవడం ద్వారా ఎరువులు పిచికారీ చేసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో జింక్ లోపం నివారణ కోసం జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 20 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలన్నారు. పంట ఎదుగుదల దశలో జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ 0.2 గ్రాములు (2 గ్రాములు, లీటరు నీటికి) పిచికారీ చేయాలన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా ఐదు రోజుల వ్యవధిలో మళ్లీ పిచికారి చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిత తెగులు నివారణ కోసం 0.3 మి.లీ ఇమిడా క్లోప్రిడ్, 2.0 మి.లీ క్లోరోథలోనిల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పచ్చి పూత దశలోని తోటల్లో 0.3 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రోఫెజిన్, 2.0 హెక్సాకొనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పశువుల్లో బ్రూసెల్లోసిస్ బ్యాక్టీరియా వ్యాధి, గొర్రెలు, మేకల్లో పీపీఆర్ వైరస్ ఆశించేందుకు అవకాశం ఉందన్నారు. వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

స్టాన్‌లీ (జయంతి)



అమెరికాకు చెందిన పేరొందిన కామిక్ పుస్తక రచయిత స్టాన్‌లీ మార్టిన్ లీబెర్ 1922 డిసెంబరు 28న న్యూయార్క్‌లో జన్మించారు. ఎడిటర్, పబ్లిషర్, ప్రొడ్యూసర్‌గాను రాణించారు. మార్వెల్ కామిక్స్‌లో క్రియేటివ్ లీడర్‌గా గుర్తింపు పొందారు. ఆయన సృష్టించిన స్పైడర్‌మ్యాన్, ఎక్స్‌మెన్, ఐరన్ మ్యాన్ థోర్, బ్లాక్ విడో, ఫెంటాస్టిక్ ఫోర్ పాత్రలు ఎంతో పేరొందాయి. నేషనల్ మెడల్ ఆఫ్ ఆర్ట్స్ పురస్కారం, ఇతరు అవార్డులు పొందారు. అక్షరాస్యత, విద్య, కళలకోసం ప్రత్యేక ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. 2018 నవంబరు 12న కన్నుమూశారు.

ధీరూభాయ్ అంబానీ (జయంతి)



ధీరజ్‌లాల్ హీరాచంద్ అంబానీ 1932 డిసెంబరు 28న గుజరాత్ రాష్ట్రం చౌరాద్‌లో జన్మించారు. ధీరూభాయ్ అంబానీగా పేరొందారు. 350 చదరపు అడుగుల గదిలో సంస్థను ప్రారంభించి 'రిలయెన్స్ ఇండస్ట్రీస్'ను ప్రపంచస్థాయికి చేర్చిన ఘనత ఆయనది. జౌళి రంగంలో విమల్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టారు. ఫిక్కీచే 'మ్యాన్ ఆఫ్ ట్వంటీయెత్ సెంచరీ' అవార్డు పొందారు. కొడుకులు ముఖేశ్, అనిల్‌లకు వ్యాపారాలను అప్పగించారు. 2002 జూలై 6న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ విభూషణ్' పురస్కారం ప్రకటించారు.

రతన్ టాటా (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత రతన్ నవల్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ సంస్థాపకుడైన జంషెడ్‌జీ మనవడు. టాటా గ్రూప్‌కు, అనుబంధ ట్రస్టులకు దశాబ్దాలుగా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వ్యాపారధోరణి కంటే మానవతా విలువలు, విద్యకు ప్రాధాన్యం ఇస్తారు. 'ప్రైమ్ మినిస్టర్స్ కౌన్సిల్ ఆన్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' సభ్యుడిగా, 'నేషనల్ మాన్యుఫాక్చరింగ్ కాంపిటీటివ్‌నెస్ కౌన్సిల్' సభ్యుడిగా కొనసాగుతున్నారు. పద్మభూషణ్, అస్సోం వైభవ్, హానరరీ ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా తదితర అవార్డులు పొందారు. 2024 అక్టోబరు 9న కన్నుమూశారు.

అరుణ్ జైట్లీ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత అరుణ్‌జైట్లీ 1952 డిసెంబరు 28న ఢిల్లీలో జన్మించారు. బీజేపీలో పేరొందిన రాజకీయ నాయకుడు. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా వ్యవహరించారు. అనంతరం రాజకీయాల్లో ప్రధాని వాజ్‌పేయి మంత్రివర్గంలోనూ, మోదీ మంత్రివర్గంలోనూ కీలకశాఖలలో పనిచేశారు. జీఎస్టీ, నోట్లరద్దు వంటివి సమర్థవంతంగా అమలు చేశారు. బ్యాంకింగ్‌లో మొండి బకాయిల ప్రక్షాళనకు పలు సంస్కరణలు తెచ్చారు. 2019 ఆగస్టు 19న కన్నుమూశారు.

డెంజెల్ వాషింగ్టన్ (పుట్టినరోజు)



డెంజెల్ హేయెస్ వాషింగ్టన్ జూనియర్ 1954 డిసెంబరు 28న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు, నిర్మాత. నటనతోపాటు మానవత్వం కలిగిన వ్యక్తిగా పేరొందారు. 17 ఎన్ఏఏసీపీ ఇమేజ్ అవార్డులు, 3 గోల్డెన్‌గ్లోబ్ అవార్డులు, ఒక టోనీ అవార్డు, రెండు అకాడమీ పురస్కారాలు, ఉత్తమ నటుడు, జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

శిడ్లఘట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సరస్వతి విద్యాసంస్థలో ఏర్పాటైన నేర నియంత్రణ మాసోత్సవంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో యువత కీలకమని వారు తలచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. శాంతియుత సమాజం కోసం పాటుపడాలని హితవు పలికారు. మంచి అలవాట్లతో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఇటీవల అధికశాతం అపరిచితులు అడ్రస్ చెప్పాలని లేదా ఏదో ఒక కారణం చెప్పి ఏమరిచి మోసాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లు, దుకాణాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు కొంతమేర వివరాలు గుర్తించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పోలీసులు జనస్నేహిగా ప్రజల రక్షణకు శ్రమిస్తున్నారని, నేరాల నియంత్రణకు వారికి మనవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు, స్కూల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, అశ్వత్థరెడ్డిచ విజయశంకర్, నందగోపాల, వెంకటరెడ్డి, సుదర్శన్ తది తరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీఐ శ్రీనివాస్

ఆర్థికవేత్తకు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులు

దొడ్డబళ్లాపుర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతిపట్ల తాలూకా వ్యాప్తంగా వివిధ సంఘాలు, విద్యాసంస్థల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. పట్టణంలోని ఆర్‌ఎల్ జాలప్ప గ్రూప్ విద్యాసంస్థల ప్రాంగణంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే దేవరాజ్ అరసు విద్యాసంస్థ ఉపాధ్యక్షుడు జే రాజేంద్ర మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పరికల్పనలో భాగంగా దేశాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. మరణానంతర భారతరత్న పురస్కారం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఎస్‌డీయూఐఎం ప్రాధ్యాపకులు ప్రొఫెసర్ కేఆర్ రవికిరణ్ మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన గొప్ప ఆర్థికవేత్తలలో ఒకరన్నారు. ఆయన దూరదృష్టి గలవారన్నారు. ఆయన పాలనలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా దేశంలో లక్షలాదిమందికి ఉపాధి దక్కుతోందన్నారు. సమాచార హక్కుచట్టం అమలు చేశారన్నారు. అమెరికాతో చేసుకున్న పరమాణు ఒప్పందంతో అంతర్జాతీయస్థాయిలో భారత్ స్థానం బలోపేతమైందన్నారు. ఆధార్ పథకంఆయన హయాంలోనే అలమైందన్నారు. పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆర్‌ఎల్ జాలప్ప విద్యాసంస్థల మానవ వనరుల విభాగం డైరెక్టర్ బాబురెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలసంతతో కనీస పరిజ్ఞానం



సంత నిర్వహిస్తున్న విద్యార్థులు

శిడ్లఘట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలల సంత ద్వారా విద్యార్థులలో కనీస వ్యవహార జ్ఞానం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు హెచ్‌ఎస్ రుద్రేశ్ మూర్తి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని జంగమకోటె హోబళి సుగుటూరు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత దినోత్సవంలో భాగంగా చిన్నారులచే సంత ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు కొనుగోలు, విక్రయాల ద్వారా గణితంతోపాటు పలు సామాజిక అంశాలు తెలుస్తాయన్నారు. అంతకుముందు గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పాం జలి ఘటించారు. విద్యార్థులకు గణితం సులభంగా అర్థం కావాలంటే తొలుత కూడికలు తీసివేతలతోపాటు కొనుగోళ్ల ద్వారా తెలియచేసేందుకు కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఎస్‌డిఎంసి అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యాయుడు ఎం మధు, గ్రామపంచాయతీ సభ్యుడు అశ్వత్థ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చేరిన రాజస్థాన్ ఎంపీ

▸▸ పరామర్శించిన సీఎం సిద్దరామయ్య తదితరులు



పరామర్శిస్తున్న సీఎం తదితరులు

బెంగళూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెళగావిలో కాంగ్రెస్ పార్టీ శతాబ్ది సంబరాలలో పాల్గొనేందుకు వచ్చిన రాజస్థాన్ రాజ్యసభ సభ్యుడు నీరజ్ డంగి అస్వస్థతకు లోనయ్యారు. గురువారం బెళగావికి వచ్చిన ఎంపీ నీరజ్ డంగి ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. ఆయనను వెంటనే బెళగావి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో ఉంచి చికిత్సలు అంది స్తున్నారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్దరామయ్య ఆసుపత్రికి చేరుకుని ఎంపీ నీరజ్‌డంగిని పరామర్శించారు. అతడికి చికిత్సలు అందిస్తున్న వైద్యులను సమాచారం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఎంపీ ఆరోగ్యం నిల కడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్సలు అందించాలని ముఖ్య మంత్రి ఆసుపత్రి వైద్యులకు సూచించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కేజే జార్జ్, సతీష్ జార్కిహోళి, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య తదితరులు ఎంపీని పరామర్శించిన వారిలో ఉన్నారు.

పోస్టుమన్ తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



మీడియా సమావేశంలో దేవాంగసంఘం పదాధికారులు తదితరులు

దొమ్మసంద్ర, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్ర గ్రామానికి పోస్ట్‌మన్ సక్రమంగా టపాలు ఇవ్వడం లేదని దేవాంగ సంఘం అధ్యక్షుడు డీసీ మనోహర్ ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం గ్రామస్థులతో కలసి మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో రైతులు, నేతకార్మికులు అధికంగా ఉన్నారని బ్యాంకులు, సంఘ సంస్థలతో లావాదేవీలు అధికమన్నారు. బ్యాంకులనుంచి రావాల్సిన చెక్‌బుక్‌లు, రిజిస్టర్ పార్సిల్స్ ఇంకా కోర్టు నోటీసులు వంటివి సకాలంలో అందచేయడంలో పోస్టుమన్ విఫలమయ్యారన్నారు. అంతేకాక ప్రభుత్వ పథకాలకు సంబంధించి వితంతు వేతనం, దివ్యాంగులు, వృద్ధుల నెలవారీ ప్రోత్సాహకం, ఇలా ఎన్నీ కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. పింఛన్లకోసం వృద్ధులు ఎదురుచూస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై సర్జాపురశాఖ పోస్ట్‌మాస్టర్ మంజునాథ్ స్పందిస్తూ బ్యాంకు చెక్కులు, టపాలు, సంఘాలకు చెందిన సమాచారాన్ని, కోర్టు నోటీసులు వంటివి జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. గ్రామస్థుల సమస్యలపై చన్నపట్టణ పోస్టల్ ప్రధాన కార్యాలయ ఉప అధికారి గిరీశ్, కనకపుర పోస్టల్ అధికారి రాహుల్ రంజన్‌సింగ్‌లు ఫోన్ ద్వారా సానుకూలంగా స్పందించారు. మీడియా సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పుట్టణ్ణయ్య, కోశాధికారి కరియప్ప, కార్యదర్శి త్యాగరాజు, గ్రామస్థులు డీసీ రవీశ్‌కుమార్, పవర్‌లూమ్స్ సొసైటీ డైరెక్టర్ చంద్రశేఖర్, సతీశ్, ప్రకాశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో హత్య
ఇద్దరు నిందితుల అరెస్టు



దేవరాజ్ (ఫైల్)

దొడ్డబళ్లాపుర, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో ఒకరిని హత్య చేసి శవాన్ని మరో చోట పూడ్చిన తరహాలో బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్లాపుర రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దాదాపు దృశ్యం సినిమాను తలదన్నేలా ఘటన చోటు చేసుకుంది. దొడ్డబళ్లాపుర శివారులోని రఘునాథపుర ప్రతిష్ఠాత్మక నారాయణ్ ఇన్ఫోసిటీలో కనిపించకుండా పోయిన దేవరాజ్ హత్యకు గురైనట్టు తేలింది. ఘటనకు సంబంధించి శుక్రవారం పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికితీసిన అనంతరం దొడ్డబళ్లాపుర రూరల్ సీఐ సాదిక్‌పాషా మీడియాకు వివరాలు వెల్లడించారు. బాశెట్టిహళ్ళికి చెందిన దేవరాజ్ (65) అక్టోబరు 17న నందిని పాలబూత్ నుంచి సాయంత్రం 5.45 గంటలకు రాలేదు. అప్పటినుంచి కనిపించలేదంటూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో మృతుడి తల వెంట్రుకలు, పాదరక్షలు లభించాయి. మరింత సమాచారం కోసం మధురె చెరువులో మృతదేహం కోసం శోధించారు. కాగా దర్యాప్తును ముమ్మరం చేసిన అనంతరం హత్యగా నిర్ధారించారు. నిందితులు రాజ్‌కుమార్, అనిల్‌లను అదుపులోకి తీసుకున్నారు.

ఘటన నేపథ్యం ఇదీ...

వడ్డీ వ్యాపారి దేవరాజ్‌ను హతమార్చేందుకు ముందస్తుగా కుట్ర పన్నారు. హత్య చేసిన తర్వాత శవాన్ని పాతేందుకు దొడ్డబళ్లాపుర శివారులోని నారాయణ్ ఇన్ఫోసిటీలో అక్టోబరు 15న పెద్దగుంత తవ్వారు. కాగా అక్టోబరు 17న డబ్బు ఇస్తానని నమ్మించి గౌరిబిదనూరు వైపు పిలుచుకుని వెళ్లి కారులో తాడుతో గొంతుబిగించి దేవరాజ్‌ను హతమారుస్తారు. అనంతరం ఆదేరోజు రాత్రి 10 గంటలకు అప్పటికే సిద్ధంగా ఉన్న గుంతలో పూడ్చివేశారు. అనంతరం అనుమానం వస్తుందన్న ఉద్దేశ్యంతో మృతదేహాన్ని మళ్ళీ తీసి గ్యారేజ్‌లోని ఇనుపడ్రమ్‌లో ఉంచి పెట్రోల్ పోసి నిప్పంటిస్తారు. అనంతరం మిగిలిన ఎముకలు, బూడిదను ఒక సంచిలో వేసి బరువైన రాయిని కట్టి మధురె చెరువునీటిలో పడేశారని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీల కారణంగానే దేవరాజ్‌ను హతమార్చినట్టు తెలుస్తోంది. ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు.



పోలీసుల అదుపులో నిందితులు

డ్రైనేజీలో చెత్త తొలగింపు



క్రేన్‌ల సాయంతో కార్యాచరణ ఇలా...

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని రద్దీ రోడ్లలో ఒకటైన జేసీ రోడ్డులో జలమండలి సిబ్బంది అత్యవసర మరమ్మతు చర్యలు చేపట్టారు. డ్రైనేజీలో సమస్య తలెత్తడంతో కొంతమేర తవ్వి పనులు నిర్వహించారు. ఇందుకు భారీ క్రేన్, ఇతర యంత్రాలు ఉపయోగించారు. ఇతర చోట్ల కూడా నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించారు.

నేటి నుంచి
పీసీ సర్కార్ మ్యాజిక్ షో

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత మెజీషియన్ పీసీ సర్కార్ (పోరుశ్) ఈనెల 28, 29 తేదీలలో టౌన్‌హాల్‌లో మెగా మ్యాజిక్ షో జరగనుంది. ఇంద్రజాల ప్రదర్శన వీక్షణకు సంబంధించి బుక్ మై షో ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం ఉందని ఆసక్తిగలవారు వీక్షించవచ్చునని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్: కలెక్టర్


పుట్టపర్తి టౌన్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ కులగణనపై జనవరి 10వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ జనాభా, పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యార్హత, వృత్తి, తదితర వివరాలపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. తద్వారా సేకరించిన సమాచారాన్ని ఈనెల 31వ తేదీలోపు వార్డు, సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. జనవరి 10న కులగణన పూర్తి వివరాలు పొందుపరుస్తామన్నారు డేటాపై అభ్యంతరాలను సంబంధిత వీఆర్వోలకు అందజేయాలన్నారు. వాటిని వీఆర్వోలు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తారని కలెక్టర్ వివరించారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్ భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్టు తెలిపారు.

జగరాజుపల్లిలో వనమహోత్సవం

పుట్టపర్తిరూరల్ డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, మోడల్ స్కూల్‌లో పచ్చదనం పరిశుభ్రత వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్వీయూ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు రమణమూర్తి, ఎంకే జోష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.43	1,589.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	108	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,549	0
నీటి నిల్వ (టీఎంసీలు)	84.73	10.55

జల్లుదరింపు..!

బళ్లారిరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులు వరి రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. తాలుకాలోని రూపనగుడి, మోకా, గోటూరు, కృష్ణానగర్ క్యాంపు, ఎర్రంగిలి తదితర ప్రాంతాల్లో అకాల వర్షంతో గురు, శుక్రవారాల్లో జోరువాన కురిసింది. దీంతో వరి రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుప్పటపై టార్పాలిన్లు కప్పి ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్త పడ్డారు. రాయాపురం రైతు మరిస్వామి మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అసలే గిట్టుబాటు ధర లేక నష్టపోయామని, ధాన్యం తడిస్తే మరిన్ని నష్టాలు తప్పవని వాపోయారు. గతంలో రూ.3000 ఉన్న క్వింటాళ్ ధర రూ.2,200కు పడిపోయిందని, ధాన్యం రైతులకు తప్పవన్నారు. పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలనా ఆయన డిమాండ్ చేశారు. రైతు శివప్రసాద్ మాట్లాడుతూ ఏటా వరి రైతులకు నష్టాలు తప్పడం లేదన్నారు. రుద్రయ్య మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం క్వింటాల్ ధర రూ. వెయ్యి తక్కువగా ఉందని, అదీ చాలదన్నట్లు అకాల వర్షాలు ముప్పుతిప్పలు పెడుతున్నా యన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించకపోతే వరి రైతులకు కష్టాలు తప్పవన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయం



కూలేందుకు సిద్ధంగా ఉన్న యోజన కార్యాలయం

సిరుగుప్ప, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న పాత శిశు అభివృద్ధి యోజన కార్యాలయాన్ని కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన నెలకొంది. పైకప్పు కూలిపోయి, గోడలు బీటలు వారాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



గణేశ్ (ఫైల్)

రాయచూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు తాలూకా ఐదనాళ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లె రైతులు బావిలో శవం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు సోమలాపురంకు చెందిన గణేశ్ మానప్ప(21)గా గుర్తించారు. తాగిన మత్తులె బావిలో పడి ఉంటాడా? లేకా ఆత్మహత్య చేసుకుని ఉంటాడా? అన్నదాని పై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న లింగసుగూరు డీఎస్పీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తాలూకా ఆస్పత్రికి తరలించి లింగసుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తి అరెస్టు

రాయచూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మస్కి తాలూకా వీరాపురం గ్రామ శివారులో అక్రమంగా గంజాయి తోట సాగు చేసిన వ్యక్తిని తుర్విహాళ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న బళగానూరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎరియప్ప అంగడి తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం దాడి చేయగా దాదాపు 8 వేల విలువ చేసే 4.2 కీలోల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని తుర్విహాళ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



కన్నడ విశ్వవిద్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు నివాళి



రాయచూరులో కాంగ్రెస్ నేతల నివాళి

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

రాయచూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కేపీసీసీ కార్యవర్గ సభ్యుడు, నగరసభ మాజీ ఛైర్మన్ పారసమల్ సుఖాణి కీర్తించారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తు ఆయనకు ప్రగాఢ సంతాపం తెలిపారు. శుక్రవారం నగరంలోని డీసీసీ కార్యలయం వద్ద మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై నివాళులర్పించారు. ఈ సందర్బంగా మాట్లాడిన కేపీసీసీ కార్యవర్గ సభ్యుడు పారసమల్ సుఖాణి, ఆర్థిక వేత్తగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా ప్రణాళిక సంఘం ఉపాధ్యఒఉడిగా, దేశ ఆర్థిక మంత్రిగా ప్రధానిగా ఆయన చేసిన సేవలు భారతవనికి కలకాలం గుర్తుండిపోతాయన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని సుస్థిర ఆర్థిక శక్తిగా మలచిన ఘనత డాక్టర్ మన్మోహన్ సింగ్ స్వంతమన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకురాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

కన్నడ విశ్వవిద్యాలయంలో..

బళ్లారి సిటీ: కన్నడ విశ్వవిద్యాలయం హంపిలో భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. విశ్వ విద్యాలయానికి మన్మోహన్‌సింగ్ గౌరవార్థం శుక్రవారం సెలవు ప్రకటించారు. వైస్‌చాన్స్‌లర్ పరమశివమూర్తి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో అధికారులు, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరుగుప్ప: మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన భావచిత్రపటానికి పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య స్వామి, పురసభ అధ్యక్షుడు రేణుకమ్మ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నివాళులర్పించారు.

ఘాటు తగ్గిన మిరప..!

● ధరలు పడిపోవడంతో రైతుల్లో ఆవేదన



కల్లాల్లో మిరపను ఆరబోసిన రైతు

కంప్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ధరలు పడిపోవడంతో మిరప రైతుల ఆవేదనకు అంతు లేకుండాపోయింది. ఈ యేడాది ఖరీఫ్ పంటలో కంప్లి తాలుకా పరిధిలో దేవసముద్రం, మెట్రి, తిమ్మలాపురం, శ్రీరామరంగాపురం, మారుతి క్యాంపు, కలకంబ్ల, సిద్దమ్మనహళ్లి, ఎర్రంగళి తదితర గ్రామాల్లో రైతులు మిరప పంటలు వేసుకున్నారు. పంటలు వచ్చి మార్కెట్‌కు తరలించేలోపు మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. దీంతో పాటు వచ్చిన పంటను కల్లాల్లో ఆరబోసుకున్న సమయంలో చిరుజల్లులతో కూడా పంటలు తడిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి, గుంటూరు, 5555, సింజెంట కంపెనీ, ఇతర రకాల మిరప పంటలు సాగు చేశారు. దిగుబడులతో పాటు రేట్లు కూడా తగ్గాయంటున్నారు. ఈ సందర్బంగా కణివి తిమ్మలాపురం రైతు సుధాకర్ మాట్లాడుతూ.. తన నాలుగు ఎకరాల్లో మిరప పంట వేశాను. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. వచ్చిన పంటలను కోసి ఆరబోసి మార్కెట్‌కు తరలిస్తే అక్కడి వ్యాపారస్తులు క్వింటాల్ కేవలం రూ.9వేలు, రూ.పదివేలు పలుకుతోంది. ఒకప్పుడు రూ.20 నుంచి రేట్లు పలికేవి. ప్రస్తుతం పూర్తిగా ధరలు తగ్గడంతోపాటు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాక పూర్తిగా నష్టాలపాలయ్యామన్నారు. ఈ యేడాది పెట్టుబడులు కూడా ఎక్కువగా పెట్టామని, దీనికితోడు వాతావరణంలో మార్పులు, వర్షాలు, తెగుళ్లతో పూర్తిగా నష్టపోయామన్నారు. మిరప పంట రైతుకు ఈ సారి కష్టాలను మిగిల్చిందన్నారు.

దేవదాయశాఖ విద్యాలయాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం

చెన్నై, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ఆ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మారియమ్మన్ ఆలయం, నామక్కల్ నరసింహస్వామి ఆలయం, సేలం కోట్టై మారియమ్మన్ ఆలయం, కోట్టై అళగిరి నాథస్వామి ఆలయం, కారువళ్లి ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో భక్తులు కానుకల రూపేణా చెల్లించిన 541 కేజీల బంగారు నగలను ముంబయిలోని టంకశాలలో కరిగించి స్టేట్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేసేనిమ్తిం ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అతుల్ ప్రియదర్శినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత సమయపురం మారియమ్మన్ ఆలయంలో భక్తులకు అమలు చేస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని మంత్రులిరువురూ పరిశీలించారు. ఆ సందర్భంగా ఇరువురూ కలిసి భక్తులకు అన్నం వడ్డించారు.

6న కొప్పళ్ బంద్



మాట్లాడుతున్న రాజ్యాంగ రక్షణ సమితి అధ్యక్షుడు అల్లమ ప్రభు

గంగావతి రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):లోక్‌సభ సమావేశంలో డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానించే రీతిలో కేంద్ర హోంశాఖా మంత్రి మాట్లాడడాన్ని ఖండిస్తూ జనవరి 6వ తేదీన కొప్పళ బంద్‌కు పిలుపు నిస్తున్నటు రాజ్యాంగ రక్షణ సమితి అధ్యక్షుడు అల్లమ ప్రభు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ సమావేశంలో రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న సమయంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ గురించి అవహేళనగా మాట్లాడారని, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను గౌరవించాల్సిన మంత్రి ఇలా మాట్లాడడం సరికాదని, అమిత్ షా మాటలను ఖండిస్తూ జనవరి 6న తాలూకా క్రీడామైదానం నుండి అంబేడ్కర్ చిత్రపటం ఊరేగించనున్నట్లు, అదే రోజు కొప్పళ బంద్ పాటించాలని, బంద్‌కు అందరూ స్వచ్ఛందంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హనుమేష్ కెమని సలీం ఖద్రి, టి.రత్నాకర, అల్లమ ప్రభు బెట్టదూరు, కె.ఎస్. మైలారప్ప, ఈశప్ప, కాశప్ప చలవాది, రామణ్ణ చౌడ్కి, తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మూడు రోజుల్లో మరో అల్పపీడనం

చెన్నై, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మూడు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడనున్న ఈ అల్పపీడనం మూడు రోజుల తర్వాత పడమటి దిశగా వాయువ్య బంగాళాఖాతంలో శ్రీలంకకు దక్షిణదిశగా కదలనుందన్నారు. ఈ అల్పపీడనం కారణంగా జనవరి 1, 2 తేదీల్లో సముద్రతీర జిల్లాల్లో పడమటి కనుమల సమీప జిల్లాలు, ఉత్తరాది జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. జనవరి 3 నుంచి 8 వరకు పలు ప్రాంతాల్లో మంచుకురుస్తుందని, కొడైకెనాల్, ఊటీ తదితర ప్రాంతాలను దట్టమైన మంచు కప్పేస్తుందని తెలిపారు. జనవరి 10న ఈశాన్య రుతుపవనాలు కూడా రాష్ట్రం నుండి వెళ్ళనున్నాయని తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మంచుకురవడం, చలిగాలులు వీస్తూ, తరచూ జల్లులు పడుతూ ఎండలు కూడా బాగా కాస్తాయని వివరించారు. ఇక ఉత్తరాది సముద్రతీర జిల్లాల వైపు దిశగా కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం పూర్తిగా బలహీనపడిందని, ఈ కారణంగా వచ్చే ఆరు రోజులపాటు రాష్ట్రంలో అక్కడక్కడా జల్లులు పడతాయని వివరించారు. నగరానికి సంబంధించినంత వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవాల సమన్వయకర్త బసవరాజ్ పాటిల్

28 నుంచి భారతీయ సంస్కృతి ఉత్సవం

బళ్లారి సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొట్టాల బసవేశ్వర భారతీయ విద్యాకమిటీ, భారత వికాస సంఘం, కలబురగి వికాస అకాడమీ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతీ ఉత్సవం పేరుతో కొట్టాల స్వర్ణ జయంతి జనవరి 28నుంచి ఫిబ్రవరి 6వ తేది వరకు నిర్వహించనున్నారు. ఉత్సవ వివరాలను మాజీ ఎంపీ, ఉత్సవాల సమన్వయకర్త బసవ రాజ్ పాటిల్ శుక్రవాం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, నీరు, ప్రకృతి పరిరక్షణే ధ్యేయంగా వికాస్ అకాడమీ పనిచేస్తుందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ఏడవ ఇండియన్ కల్చర్ ఫెస్టివల్ 240 విస్తీర్ణంలో 10రోజుల పాటు జరగనుందన్నారు. వ్యవసాయం, విజ్ఞానం, సైన్స్, దృశ్యకళలు, ఆరోగ్యం, సేవ పిల్లలు, దేశీయ పరిశ్రమ, సంస్కృతి ప్రపంచం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. తొలిరోజు కరచాలన కార్యక్రమం, ఫిబ్రవరి 2నఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు యోగా శిబిరం కూడా నిర్వహించనున్నారు. ఇందులో లక్ష మంది యోగులు పోల్గొంటారు. 10రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి 30లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. వివిధరంగాల్లో ప్రతిభ కనబరిచిన 300మందిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు ఇందులో పాల్గొంటారు. పలువురు ప్రముఖులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సమావేశంలో సండూర్‌కు చెందిన మైనింగ్ వ్యాపారి బీకే.నాగనగౌడ్, మాజీ మేయర్ పార్వతి ఇందు శేఖర్, అడిస్వామి, వెంకటేశ్ బగిగేర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మదేవి కలశ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సుంకులమ్మదేవి నూతన కలశ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. శిరిగేరి గ్రామంలో సుంకులమ్మ ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్యస్వామి, కాంగ్రెస్ నాయకులు కరిబసప్ప, గ్రామ ప్రముఖులు అడివయ్యస్వామి, వీరన్నగౌడ పాల్గొన్నారు.

సామూహిక వివాహాల నిర్వహణ అభినందనీయం

● జంటలను ఆశీర్వదించిన కలిగణనాథ స్వామి



వధూవరులను ఆశీర్వదిస్తున్న కలిగణనాథ స్వామి

రాయచూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఆలంబన ఉండే రీతిలో ప్రతి ఏటా ఉచితంగా సామూహిక వివాహాల నిర్వహణ అభినందనీయమని యరమరస్కఉ చెందిన కలిగణనాథ స్వామి హర్షం వ్యక్తం చేశారు. మస్కి తాలూకా మల్లదగుడ్డా గ్రామంలో శుక్రవారం ఆరూఢ అయ్యప్ప స్వామి మఠం వద్ద నిర్వహించిన సామూహిక వివాహాల కార్యక్రమాలకు స్వామి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఏటా స్వామివారి పుణ్యస్మరణ సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తుండడం ఇతరులకు మార్గదర్శకమన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ వల్ల నిర్వాహకులకు పుణ్యఫలం లభించడమే కాదు నిరుపేదలకు ఎంతో తోడ్పాటు లభిస్తుందన్నారు.

బెంగళూరు దాహం తీరుస్తున్న కబిని జలాశయం



బహుమతులు అందజేస్తున్న టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు మైసూరు పట్టణ ప్రాంతాలకు నీటి సరఫరాలో కబిని జలాశయం ప్రముఖ పాత్ర పోషిస్తుందని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి తెలిపారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కబిని రిజర్వాయర్ ప్రాముఖ్యతపై తరగతి చిన్నారులు చేసిన ప్రసంగాన్నివిని ఆయన మాట్లాడారు. పూర్వం బ్రిటీషు అధికారులు,మైసూర్ మహారాజా కబిని చుట్టూ ఉన్న పార్కులో జంతువులను వేటాడేవారు. దీని దగ్గరలోనే నాగర్‌హోల్ నేషనల్ పార్కు, బండీపూర్ పార్క్, మంచెగౌడన హళ్ళి, కుప్పేబెట్ట వంటి వన్యప్రాణుల ప్రదేశాలు ఉన్నాయి. 166అడుగుల ఎత్తు, ఎనిమిదిగేట్లు,నీటినిల్వ సామర్థ్యం 28టీఎంసీలు , ఇది త్రాగునీరు, నీటిపారుదల కొరకు ఉపయోగించబడుతుంది. ఇది ముఖ్యమైన రిజర్వాయర్లలో ఒకటి. తదుపరి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈసందర్భంలో రామాంజినేయ,గురుప్రసాద్,విజయ ముంద్రగి తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాలలు.. కడియం నర్సరీలు

● రాష్ట్ర ఉద్యానశాఖ డీడీ విశ్వనాథశర్మ

కడియం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో నర్సరీలు ప్రయోగశాలలు అని కర్ణాటక ఉద్యానశాఖ డీడీ విశ్వనాథశర్మ పేర్కొన్నారు. కర్నాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది ఉద్యానశాఖ అధికారులు సత్యదేవా, పల్ల వెంకన్న, సత్యనారాయణ, వెంకట శ్రీనివాసా, గౌతమీ నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను శ్రీదుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనుతో కలిసి పరిశీలించారు. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌ను పరిశీలించి మార్కెట్ విధి విధానాలపై యాజమాన్యాన్ని అడిగారు. మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ళ సత్యనారాయణ, పల్ల సత్తిబాబు, పుల్లా పెదసత్యనారాయణ, మల్లు పోలరాజు, చిలుకూరి త్రిమూర్తులు, మార్గాని వీరబాబు, ధర్మాసనం వెంకటరమణ మొక్కల విశిష్టతలను వివరించారు.



ఉద్యాన అధికారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూలవ్యాపారులు

హోసూరు జోన్

మన్మోహన్ సింగ్‌కు ఐఎన్‌టీయూసీ నివాళి



నివాళి అర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ సభ్యులు

హోసూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో హోసూరు కామరాజ్ కాలనీలో కార్యాలయంలో నివాళులు అర్పించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఐఎన్‌టియూసీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే మనోహరన్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియూసీ రాష్ట్ర సంస్థ కార్యదర్శి మునిరాజు, నిర్వాహకులు సత్యమూర్తి, పరమానంద ప్రసాద్, రాజేంద్రన్, కోదండరామన్, ముత్తప్ప, సెల్వం, భక్తవత్సలం, మారప్ప, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు మైజా అక్బర్, కీర్తి గణేశ్, త్యాగరాజన్ ఇర్షాద్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



శానమావు అడవుల్లో సంచరిస్తున్న గజరాజుల బృందం

ఏనుగుల సంచారంపై అధికారుల హెచ్చరికలు

హోసూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని శానమావు అడవుల్లో సుమారు 17 ఏనుగులు బస చేసినట్టు తెలుస్తోంది. ఏనుగుల సంచారం అధికం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది. హోసూరు అటవీ ప్రాంతంలో మొత్తం 250 ఏనుగులు ఉన్నట్టు తెలుస్తోంది. వీటిలో 100 ఏనుగులు తమిళనాడువిగాను, మిగిలిన 150 ఏనుగులు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్ర అటవీ ప్రాంతానికి చెందినవిగా ఉన్నట్టు సమాచారం. ఈ ఏనుగులు గుంపులుగా విడిపోయి జవలగిరి, డెంకణీకోట, తళి, కెలమంగలం, రాయకోట, అయ్యూర్, హోసూరు తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో అడవికి సమీపంలోని గ్రామాల్లోకి ప్రవేశించి పంటలను నాశనం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతం నుంచి 14 ఏనుగులు శానమావు అటవీ ప్రాంతానికి వచ్చాయి. వాటిని దట్టమైన అడవుల్లోకి పంపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. కావున సినిగిరిపల్లి, అనుమంతరపురం, టి.కొత్తపల్లి, కొమ్మేపల్లి, శానమావు, బేన్నికల్, పరిసర ప్రాంతాల గ్రామస్తులు, రైతులు సురక్షితంగా ఉండాలని హెచ్చరించారు.

కోర్టు ప్రాంగణంలో బందోబస్తు పెంపు

హోసూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు తాలూకాలోని కోర్టు సముదాయ ప్రాంగణంలో బందోబస్తు కల్పించారు. నెల్లై కోర్టు ఆవరణ యువకుడి హత్య ఘటనపై స్పందించిన కృష్ణగిరి జిల్లా యంత్రాంగం హోసూరులో కోర్టు సముదాయంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. నెల్లై జిల్లాలోని కీజనంతం గ్రామంకు చెందిన మాయాండి(23) ని ఓ కేసులో కోర్టుకు వెళ్లిన సమయంలో 20వ తేదీన ఓ ముఠా హతమార్చింది. ఈ ఘటన తమిళనాడులో కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించి హైకోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కోర్టు ప్రాంగణంలో పోలీసు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. డీజీపీ శంకర్ జివాల్ సూచనతో కోర్టు ప్రాంగణంలో సాయుధబలగాలతో భద్రల కల్పించారు. తనిఖీ చేసిన తర్వాత వారు లోపలికి అనుమతిస్తున్నారు.



పహరా కాస్తున్న పోలీసులు